క్లుప్తంగా

సకాలంలో కౌలు చెల్లించాలి



రెంటచింతల: సత్రశాల దేవస్థానం భూముల్లో సాగుచేస్తున్న వారందరూ సకాలంలో కౌలు చెల్లించి ఎండోమెంట్ అధికారులకు సహకరించాలని ఆ శాఖ ఈఓ గాదె రామిరెడ్డి కోరారు. గురువారం దుర్గి మండలంలోని అడిగొప్పులలో సత్రశాల దేవస్థానానికి చెందిన సర్వే నెంబర్ 421లో నున్న 11.65 ఎకరాల మాగాణి భూములను గత 30 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న రైతులు, రైతుకూలీ సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. రైతు కూలీ సంఘం నాయకులు, సాగుదారులు పాల్గొన్నారు.

సత్రశాల ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా గుండా వెంకట శివయ్య



రెంటచింతల: మండలంలోని సత్రశాల వద్ద నున్న అతిపురాతన శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానం నూతన ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా జెట్టిపాలెం గ్రామానికి చెందిన గుండా వెంకట శివయ్యను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి గురువారం తెలిపారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా కంచనపల్లి బ్రహ్మయ్య, పోట్ల పద్మ, దొడ్డా నారాయణ, సురభి శైలజ, గుమ్మడేళ్ల పుష్పావతి, భువనగిరి ఆంజనేయశర్మతో పాటు ఎక్స్ ఆఫీషియో మెంబర్‌గా అర్చకుడు చిట్టేల శివయ్యలను ఎంపికచేయడం జరిగిందన్నారు. ఈ నూతన కార్యవర్గం రెండు సంవత్సరాలు కొనసాగుతుందన్నారు.

కాల్ సెంటర్ ప్రారంభం

మాచర్ల: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం మాచర్ల విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను ప్రారంభించినట్లు డీఈ ఎం.సింగయ్య తెలిపారు. ఈ కాల్ సెంటర్ ఈనెల 19వ తేదీ వరకు పనిచేస్తుందన్నారు. కాల్ సెంటర్ 9440817531 నంబరుకు 24 గంటలూ అందుబాటులో ఉంటుందన్నారు. విద్యుత్ స్తంభాలు పడి పోవడం, విద్యుత్ వైర్లు తెగిపోవడం, ఇతర విద్యుత్ సమస్యలు ఉంటే కాల్ సెంటర్‌కు సమాచారం అందజేయాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పిడుగురాళ్ల: అప్రమత్తతోనే ప్రాణాలను కాపాడుకోవచ్చని విద్యుత్ శాఖ ఏఈ సైదారావు అన్నారు. వర్షాల నేపథ్యంలో గురువారం ఆయన విద్యుత్‌కు సంబంధించిన పలు సూచనలు చేశారు. తడిసిన కరెంట్ స్తంభాలను ఎట్టి పరిస్థితుల్లో ముట్టుకోకూడదన్నారు. విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోవద్దని, విద్యుత్ లైన్‌కు చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

పిడుగురాళ్ల: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగరాజు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పిడుగురాళ్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రాజేశ్వరి(25) అనే యువతికి కుటుంబ సభ్యులు మంగళవారం వివాహం నిశ్చయించారు. బుధవారం ఆమె ఇంట్లో వెళ్లిపోయినట్లు తెలిపారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో విచారణ చేసినా కూడా ఆచూకీ లేకపోవడంతో తల్లి అరుణ కుమారి పిడుగురాళ్ల పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగరాజు పేర్కొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేడుకలు

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాలు నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దుర్గి పీఏసీఎస్ అధ్యక్షుడిగా రామ్మోహనరావు



దుర్గి: దుర్గి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా కటకం రామ్మోహనరావును ప్రభుత్వం నియమించింది. సొసైటీ కమిటీలో సభ్యులుగా దారా వెంకట రాఘవరావు, కోడె కోటేశ్వరరావులు నియమితులయ్యారు.

దొడ్లేరు గ్రామంలో జ్వరాల సర్వే

దొడ్లేరు(క్రోసూరు): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో దొడ్లేరులో గురువారం వర్షం ప్రభావానికి గురైన గృహాలను పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. జ్వర పీడితులు ఎవరైనా ఉన్నారా అని సర్వే నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి సబ్ యూనిట్ అధికారి షేక్ బేగ్, ఎంఎల్‌హెచ్‌పీ భూలక్ష్మి, ఆశా కార్యకర్త త్రివేణి పాల్గొన్నారు.

మహాత్ముడు నడయాడిన రెంటచింతల

- 1929లో మహాత్మా గాంధీని గ్రామానికి తీసుకొచ్చిన పల్నాడు గాంధీ నాళం మట్టుపల్లి
- స్థానిక వైఆర్‌ఎస్ ఉన్నత పాఠశాలలో నూలు వడికిన బాపూజీ



పల్నాడు గాంధీ నాళం మట్టుపల్లి(ఫైల్)



మహాత్ముడి సభ జరిగిన రెంటచింతలలోని వైఆర్‌ఎస్ ఉన్నత పాఠశాల

రెంటచింతల: దేశ స్వాతంత్ర్య సంగ్రామం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో 1929 సంవత్సరంలో పల్నాడు గాంధీగా పేరుపొందిన నాళం మట్టుపల్లి జాతిపిత మహాత్మ గాంధీని రెంటచింతలకు తీసుకువచ్చిన జ్ఞాపకాలను ఇప్పటికీ గ్రామస్తులు చర్చించుకుంటారు. మహాత్ముడి పాద స్పర్శతో రెంటచింతల పులకించింది. 1929 ఏప్రిల్ 21న స్థానిక వైఆర్‌ఎస్ (ఎనిశెట్టి రంగనాయకుల శ్రేష్టి) ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మగ్గాలను ఏర్పాటు చేసి గ్రామానికి చెందిన పలువురితో కలిసి గాంధీజీ నూలు వడికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పలువురు స్వాతంత్ర్య సమరయోధులతో స్వాతంత్ర్య ఉద్యమ ఆవశ్యకతపై గాంధీజీ సుదీర్ఘంగా ప్రసంగించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. దీనికి గుర్తుగా పాఠశాల ఎదురుగా ఉన్న కాలనీకి గాంధీనగర్‌గా నామకరణం చేశారు. స్థానిక శ్రీ లాలా లజపతిరాయ్ ప్రాథమిక పాఠశాల (ఎల్ఎల్ఆర్)కు గాంధీజీ భూమి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అప్పటి నుంచి నాళం మట్టుపల్లి పల్నాడు గాంధీగా ఈ పల్నాడు ప్రాంతంలో పేరుపొందారు. ప్రతి సంవత్సరం ఆగస్టు నెల 15వ తేదీ వచ్చిందంటే గ్రామానికి చెందిన పలువురు వృద్ధులు ఇప్పటికీ నాటి సంఘటనలను జ్ఞాపకం చేసుకుంటుంటారు.

స్వాతంత్ర్య స్ఫూర్తి



జాతిపిత భూమి పూజ చేసిన ఎల్ఎల్ఆర్ ప్రాథమిక పాఠశాల

పత్తి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



ఏడీఏ జగదీశ్వరరెడ్డి

మాచర్ల: మాచర్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని గత మూడు రోజులుగా కురిసిన భారీవర్షానికి పత్తి రైతులు నష్టపోయే అవకాశం ఉందని ఏడీఏ జగదీశ్వరరెడ్డి గురువారం తెలిపారు. రైతులు సూచనలు, సలహాలు సూచించారు. పత్తిలో కాయ కుళ్లు వచ్చే అవకాశం ఉందని, పువ్వు, కాయ రాలిపోతుందన్నారు. ముందుగా పొలాల్లో నీరు తొలగించాలన్నారు. కలుపు మొక్కలు పెరగకుండా చూడాలన్నారు. ఎకరానికి పది కిలోల యూరియా, పది కిలోల పొటాష్ ,బూస్టర్ మోతాదు పంటకు ఉపయోగించాలన్నారు. కాయ కుళ్లిపోకుండా ఉండేందుకు తెగుళ్ల మందు పిచికారీ చేయాలన్నారు.

పొలాలలో నీరు నిల్వ ఉంచొద్దు..

పిడుగురాళ్ల రూరల్: ప్రస్తుతం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులకు ఏఓ సంధ్యారాణి పలు సూచనలు చేశారు. వరి పొలాల్లో, మొక్కజొన్న, పత్తి మొక్కల (సాళ్ళ) మధ్య నీరు నిలవకుండా, బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలి. అధిక వర్షాల వలన పత్తి మొక్కలు పసుపు రంగులోకి మారే అవకాశం ఉంది. దీని అధిగమించడానికి మొక్క వయసును బట్టి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 19.19.19 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అదేవిధంగా పంట ఎదుగుదలను పెంచడానికి వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలి. జొన్న, మొక్క జొన్నలలో అధిక తేమ వలన భాస్వరం తగ్గి (లోపించి), మొక్కలన్నీ ఊదారంగులోకి మారే అవకాశం ఉంటుంది. వర్షాలు తగ్గిన తర్వాత, పొటాషియం నైట్రేట్ లేదా 19-19-19, 10 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత అదనపు మోతాదుగా ఎకరాకు 20-25 కిలోల యూరియా,15 నుంచి 20 కిలోల మూరేట్ ఆఫ్ పొటాష్‌ను అందజేయాలి. కత్తెర పురుగు సమస్య ఎక్కువగా ఉంటే క్లోరంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ లేదా స్పైనటోరం 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి ఆకుల సుడులు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. వర్షాలకు వరి నాటు వేసిన పొలాలు పూర్తిగా దెబ్బతిన్నట్లయితే ఆ పొలాలను దమ్ము చేసి మళ్లీ స్వల్పకాలిక రకాలను ఎంచుకొని నేరుగా విత్తుకోవాలి. చల్లటి వాతావరణంలో అగ్గి తెగులు సోకే అవకాశం ఉంది. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ + మానుకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారీ చేయాలాని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున పంట పొలాల నుంచి ఎప్పటికప్పుడు వర్షపు నీటిని తొలగించాలి. రైతులు సరైన సమయంలో యాజమాన్య పద్ధతులు, జాగ్రత్తలు పంట నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పంటలకు ఎలాంటి చీడపురుగుల బెడద రోగాలు లేకుండా చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని ఏఈఓ సంధ్యారాణి తెలిపారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



కారెంపూడిలో 300 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

రెంటచింతల: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు బోయ నాగిరెడ్డి నేతృత్వంలో గురువారం మండల కేంద్రమైన రెంటచింతలలో స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి గ్రామ పురవీధులలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. జాతీయ జెండాలను చేబూని భారత్‌మాతకు జై అంటూ విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మాచర్ల - గుంటూరు ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పాడగా స్కూల్ ప్రిన్సిపాల్ సింహాద్రి మోహన్ ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. విద్యావేత్త నారాయణపురం శ్రీనివాస్, వేణుగోపాలస్వామి దేవస్థానం చైర్మన్ కట్టిబోయిన సైదులు, బీజేపీ మండల నాయకులు ఎ.గోపి, కె.రాజేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ టి.అమరనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కారెంపూడిలో...

కారెంపూడి: హర్ ఘర్ తిరంగా ర్యాలీ కారెంపూడిలో గురువారం జరిగింది. సుమారు 1500 మంది విద్యార్థులు మండల స్థాయి అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. 300 అడుగుల పొడవున్న జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్‌వరకు ర్యాలీ కొనసాగింది. తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధన కోసం కృషి చేసిన అమర వీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, అందరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగుర వేయాలని పిలుపు నిచ్చారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ వాసు, ఏఓ నరసింహారావు, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రెంటచింతలలో మాచర్ల - గుంటూరు ప్రధాన రహదారిపై తిరంగా ర్యాలీ

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

మాచర్ల: స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాచర్ల తహసీల్దార్ కార్యాలయంలో జరిగే వేడుకల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జాతీయ జెండాను ఎగురవేస్తారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మదార్ సాహెబ్, మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ఆర్.మల్లేశ్వరిరి వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహోత్సవాలు



విద్యుద్దీపాల వెలుగులో పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం

రాజుపాలెం: మండల కేంద్రమైన రాజుపాలెంలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం 13వ వార్షిక బ్రహోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. రాజుపాలెంకు చెందిన పాత్తూరి నరసాదాస్, తిరుపతమ్మల తనయుడు పాత్తూరి వెంకట రామసుబ్బారావు ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ వరకు వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 2012 జూలై 26న నిర్మించిన ఆలయంలో గత 12 ఏళ్లుగా బ్రహోత్సవాలు వైభవంగా జరిపిస్తున్నారు. కలియుగ ప్రత్యక్ష దైవంగా పిలువబడే వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యోత్సవాలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాలను క్రమం తప్పకుండా శాస్త్రోక్తంగా జరిపిస్తున్నారు.

భక్తుల సహకారం ఎనలేనిది

గత 12 ఏళ్లుగా రాజుపాలెంలో పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తులు అందిస్తున్న సహకారం ఎనలేనిది. భక్తజనం సహకారంతో నిర్వహించే వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలి.

– పాత్తూరి వెంకట రామసుబ్బారావు

ఆటో.. ఇటో అయితే!

- ఆటోల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న కూలీలు, విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



ఆటోలో నిలబడి ప్రయాణిస్తున్న కూలీలు



ఆటో వెనక వైపు నిలబడి ప్రమాదకరంగా స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

పిడుగురాళ్ల రూరల్: కఠినమైన నిబంధనలున్నా, వాటిని సక్రమంగా అమలు చేసే నాథుడు లేకపోవడంతో ఆటోలు, మినీ వ్యాన్ల యజమానులు, డ్రైవర్లు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు.

ప్రయాణికులు, కూలిలే కాదు నియోజకవర్గ పరిధిలోని విద్యాసంస్థలు, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైతం ఆటోలలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. పిడుగురాళ్ల మండలం పరిధిలోని గ్రామాల్లోని వివిధ ప్రాంతాల ప్రజలు, కూలీలు కూలిపనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. అదేవిధంగా విద్యార్థులు సైతం విద్యాసంస్థలకు ఉదయం, సాయంత్రం వేళల్లో వెళ్లి వస్తుంటారు. ఈక్రమంలో ఆటో, మినీ వ్యాను డ్రైవర్లు నిబంధనలకు వ్యతిరేకంగా పరిమితికి మించిన ప్రయాణికులతో, మితిమీరిన వేగంతో వెళుతున్నారు. ఒక్కో ఆటోలో దాదాపు 20 నుంచి 25 మందిని తీసుకెళ్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈక్రమంలో ఆటోల వెనుక నిలబడుతూ.. పక్కన వేలాడుతూ, వెనుక పక్క ఏ ఆధారం లేకుండా కూర్చొంటూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే జరిగే నష్టాన్ని ఊహించడం కష్టం.

తూతూమంత్రంగా తనిఖీలు

నియోజకవర్గంలో యథేచ్ఛగా ఆటోవాలాలు, మినీ వ్యాన్లు, జీపుల డ్రైవర్లు వాహనాల్లో జనాన్ని కుక్కేస్తూ ప్రమాదకరంగా తరలిస్తున్నా రవాణాశాఖ, పోలీసు అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. తూతూమంత్రంగా తనిఖీలు చేస్తూ.. వదిలేస్తున్న దాఖలాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు కల్పించుకుని తనిఖీలు ముమ్మరం చేసి, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

పరిమితికి మించి తరలిస్తే కఠిన చర్యలు

వాహనదారులు పరిమితికి మించి అధిక సంఖ్యలో కూలీలను, విద్యార్థులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. మేం ప్రతిరోజు తనిఖీలు చేస్తున్నాం. వాహనాల్లో లెక్కకు మించి కూలీలు కనిపిస్తే తప్పకుండా కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ,కేసులు సైతం నమోదు చేస్తున్నాం.

– ఎం.నాగేశ్వరరావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, పిడుగురాళ్ల

వీరుల మాన్యం భూమికి రక్షణ

కారెంపూడి: ఆక్రమణల దారుల నుంచి పల్నాటి వీరుల గుడికి చెందిన మాన్యం భూమిని దేవదాయ శాఖ అధికారులు పరిరక్షించారు. ఆక్రమిత భూమికి దేవదాయ శాఖ అధికారులు కౌలు నిర్ణయించి ఆక్రమణ దారులే సాగు చేసుకునే విధంగా గురువారం కౌలు పత్రాలు రాయించి ఇచ్చారు. దీంతో వీరుల గుడికి ఆదాయ వనరు కల్పించారు. చెన్నకేశవ స్వామి దేవాలయ ఈఓ కొల్లి హనుమంతరావు ఆక్రమణ దారులను పిలిపించి వారికి ఎకరాకు రూ.1500 చొప్పున కౌలు చెల్లించే విధంగా కౌలు పత్రాలు రాయించి వారి నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. దుర్గి మండలం అడిగొప్పల గ్రామంలో 28 ఎకరాల పల్నాటి వీరుల మాన్యం ఉంది. గత 30 ఏళ్ల క్రితం మావోయిస్టులు వీరుల దేవాలయ భూమిని పేదలకు పంచారు. అప్పటి నుంచి భూమిని వారు సాగు చేసుకుంటున్నారు. ఈక్రమంలో దేవాలయ ఆస్తుల పరిరక్షణలో భాగంగా అధికారులు నామమాత్రపు కౌలు నిర్ణయించి సాగు చేసుకుంటున్న వారికే కౌలుకిచ్చారు. అలాగే మండలంలో అన్యాక్రాంతం అయిన ఇతర ఆలయ భూములను కూడా పరిరక్షిస్తామని ఈఓ హనుమంతరావు తెలిపారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘ వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి గురువారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అయితే సమావేశానికి కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో వైస్ చైర్మన్ ఎన్నికను వాయిదా వేశారు. రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఎప్పుడు నోటిఫికేషన్ ఇస్తే అప్పుడు మళ్లీ ఎన్నిక నిర్వహిస్తామని కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు.

పత్తి పంటలో సస్యరక్షణ చేపట్టాలి

జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు



నందిగామలో నీట మునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యసాయ అధికారి

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన పత్తి పంట పొలాల్లో నీటిని బయటకు పంపి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు అన్నారు. మండలంలోని నందిగామ గ్రామంలో వర్షాలకు నీట మునిగిన పత్తి పంట పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పొలంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపించి, యూరియా 20 కేజీలు, పొటాష్ 10 కేజీలు ఎకరానికి చేనుపై వెదజల్లుకోవాలన్నారు. సత్తెనపల్లి ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవో బి.సుబ్బారెడ్డి, రైతులు ఉన్నారు.

ఎరువులపై సమీక్ష...

సత్తెనపల్లి సబ్ డివిజన్‌లోని పీఏసీఎస్‌లు, జీడీసీఎంఎస్, ఏబీఎఫ్ఎస్‌సీఎస్ ధూళిపాళ్ల బ్రాంచ్, తదితర ప్రభుత్వ రంగ సంస్థల సీఈఓ, ప్రెసిడెంట్లతో ఎరువుల అమ్మకాలపై జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు గురువారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల అమ్మకాలు ఈ-పాస్ ద్వారానే చేయాలన్నారు. భౌతిక నిల్వలకు ఈ-పాస్ మెషిన్‌లో పరిమాణాలకు వ్యత్యాసం ఉన్నట్లయితే వారికి ఎరువులు కేటాయింపు నిలిపివేయబడుతుందన్నారు. అదే విధంగా వారిపై శాఖాపరమైన చర్యలు కూడా తీసుకోబడతాయన్నారు. ఎరువులు అమ్మకాలు జరిపి తరువాత తప్పనిసరిగా ఈ-పాస్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో సత్తెనపల్లి ఏడీఏ బోయపాటి రవిబాబు, సత్తెనపల్లి, ముప్పాళ్ళ ఏవోలు బి.సుబ్బారెడ్డి, ఎస్.శ్రీధర్ రెడ్డి, ఆయా పీఏసీఎస్‌లు, జీడీసీఎంఎస్, ఏబీఎఫ్ఎస్‌సీఎస్ ధూళిపాళ్ల బ్రాంచ్ సీఈఓలు, ప్రెసిడెంట్లు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



నకరికల్లు: వర్షాలు ముమ్మరంగా పడుతున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీవో కె.వి.శివప్రసాద్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని చల్లగుండ్లతో పాటు పలు గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు శాంతించినందున పేరుకుపోయిన వ్యర్థాలు, మురుగు కాలువల్లో షిల్ట్‌ను తొలగించి, మురుగునీటి పారుదలను క్రమబద్ధీకరించాలన్నారు. బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్య సిబ్బందిని సమన్వయపరచుకొని తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అబ్దుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో త్రిశక్తి దుర్గా పీఠం వార్షిక బ్రహ్మోత్సవాలు



సత్తెనపల్లి: త్రిశక్తి స్వరూపిణులైన మహాలక్ష్మి, దుర్గ, సరస్వతి అమ్మవార్ల త్రిశక్తి దుర్గాపీఠం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటలకు మంగళవాయిద్యాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజ, ప్రసన్నాంజనేయ స్వామికి లక్ష నాగవల్లి దళాలతో విశేష పూజలు నిర్వహించారు. పెరుమాళ్ళ పూర్ణచంద్రరావు, లక్ష్మీజయశ్రీ ఇంటి నుంచి జగన్నాథ భజన మండలి, ఆకుల గీతాలక్ష్మి సభ్యుల కోలాటంలతో అమ్మవార్ల ప్రభ బయలుదేరగా 6వ వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణిహరి ప్రారంభించి అమ్మవార్లకు పుష్పాభిషేకం అందించారు. త్రిశక్తి దుర్గా పీఠం మహిళాశక్తి సభ్యుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవార్ల ఊరేగింపు త్రిశక్తి దుర్గాపీఠం గణేష్ యూత్, మహిళా శక్తి సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కలవకొలను సీతారామ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులయ్యారు. పీఠాధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.